75

# బోర్లాగ్ : సోల్జెనిత్సిన్

1950లో మెక్సికోలో హెక్టేరుకు 11 బుషెల్స్ గోధుమలు పండేవి. 1965 నాటికి హెక్టేరుకు 90 బుషెల్స్ పండసాగింది. 1950లో 4 లక్షల టన్నుల గోధుమలను దిగుమతి చేసికొన్న మెక్సికో ఈనాడు విదేశాలకు గోధుమ నెగుమతి చేస్తున్నది. ఈ విప్లవానికి కారకుడు డాక్టర్ నార్మన్ బోర్లాగ్.

"ఏ దేశంలో నయినా ఒక గొప్ప రచయిత వున్నాడు అంటే అతడు ఆ దేశానికి మరో ప్రభుత్వంవంటి వాడన్నమాట. అంచేతనే ఏ ప్రభుత్వమూ గొప్ప రచయితలను ఆదరించదు; చిల్లర రచయితలనే చేరదీస్తుంది." అని "ది ఫస్ట్ సర్కిల్" అన్న నవలలో ఒకపాత్ర అంటాడు. ఆ నవల రచయిత అలెగ్జాండర్ సోల్జెనిత్సిన్.

యాభైఏళ్ళ నార్మన్ బోర్లాగ్ ప్రపంచమంతటా పేరుగాంచిన పొట్టి గోధుమ వంగడాలను సృష్టించిన అమెరికన్ వ్యవసాయ శాస్త్రజ్ఞుడు.

యాభైయొక్క సంవత్సరాల అలెగ్జాండర్ సోల్జెనిత్సిన్ నిర్భయంగా. ఆధునిక రష్యన్ సమాజపు చీకటి కోణాలను ఎత్తిచూపిన రష్యన్ రచయిత.

నార్మన్ బోర్లాగ్‌కు ఈ ఏడాది (1970) నోబెల్‌శాంతి బహుమతి నిచ్చారు. ఈ సంవత్సరపు నోబెల్ సాహిత్య బహుమతి అలెగ్జాండర్ సోల్జెనిత్సిన్ కిచ్చారు.

## శాంతి

వ్యవసాయానికి, శాంతికి ఏమి సంబంధం? విపరీతమయిన వేగంతో జనాభా పెరిగిపోతుంటే, ఆ జనాభాకు సరిపడే తిండిగింజలు లేకపోతే అశాంతి తప్పదు. ఆకలి చావులు తప్పవు. కనుకనే, ఎక్కడో మారు మూల మెక్సికోలో పొలంలో ప్రయోగాలుచేసి, గోధుమపంటలో విప్లవాన్ని సాధించినకృషి శాస్త్రజ్ఞుడికి ప్రపంచం తరఫున శాంతి బహుమతి నివ్వడం ఎంతో సముచితం అన్పిస్తుంది.

1942లో డాక్టరేట్ పుచ్చుకున్న బోర్లాగ్ 1944లో రాక్‌ఫెల్లర్ సంస్థ తరఫున మెక్సికోలో పరిశోధనలు మొదలు పెట్టారు. ఆనాటినుండి నేటిదాకా ప్రపంచ జనుల ఆకలిని తీర్చగల పైరువంగడాల సృష్టిలో నిమగ్నుడయిన యోగి నార్మన్ బోర్లాగ్. ఇతోధికంగా ఎరువులను, నీటిని వినియోగించుకొని అత్యధిక దిగుబడులను ఇవ్వగల పొట్టి గోధుమ వంగడాలను బోర్లాగ్ రూపొందించారు. ఈ వంగడాలు ఈనాడు ప్రపంచవ్యాప్తిని చెందాయి, ఆయా దేశాలలో వీటి నాధారంగా క్రొత్త వంగడాలను సృష్టించ గలిగారు. అంతేకాదు. మెక్సికోలో డా॥ బోర్లాగ్ వద్ద పనిచేసి తర్ఫీదు పొందిన కృషి శాస్త్రజ్ఞులు తమతమ దేశాలలో వ్యవసాయరంగాలలో విప్లవాత్మక మయిన మార్పులను సాధిస్తున్నారు.

బోర్లాగ్ సదా సర్వదా పొలంలోనే వుంటారు. కార్యాలయాల్లో కూర్చుని నివేదికలు తయారుచేయడం, వ్యాసాలు రాయడం అంటే ఆయన మండిపడతారు. "ఆహారమా, కాగితాలా ఏది ముఖ్యమో తేల్చుకోండి!" అంటారాయన.

"బడుగు దేశాలలో ఒక చిక్కు వుంది. అక్కడి కృషి శాస్త్రజ్ఞులు సాధారణంగా సంపన్న కుటుంబాలకు చెందినవారయి వుంటారు. వారికి వారి దేశపు "మట్టితో" ఎట్టి సంబంధమూ వుండదు. నేలలో పనిచేయటం

వారికి తెలియదు. బురదలో పనిచేయటం, ఒళ్ళంతా మురికి చేసుకోవటం వారికి వెగటుగావుంటుంది. వారి సొంత గణాంకాలపట్ల వారికేనమ్మకం వుండదు. అంతేకాదు. వారి దేశాలలో పరిస్థితి ఎటువంటిది అంటే వారుగనుక ఒక చిన్న పొరపాటు చేస్తే దేశం క్షామంతో మాడి పోవచ్చును. పనిచేస్తే పొరపాటు జరుగుతుందేమోనని ఈ నిపుణులు పనిమానేసి హాయిగా కార్యాలయాలలో, ప్రయోగశాలల్లో కూర్చుని విపులమైన వైజ్ఞానిక వ్యాసాలు రాస్తూ అర్థంలేని తర్కాలతో కాలక్షేపం చేస్తుంటారు... ఇది చాల దురదృష్టకరం. వీరిలో ప్రతిభావంతులు ఎందరో వున్నారు." అంటారు బోర్లాగ్.

బోర్లాగ్ సృష్టించిన సొనోరా'' "లెర్మారోహ'' అన్న గోధుమరకాలు మనదేశంలో ముఖ్యంగా పంజాబులో వ్యవసాయ విప్లవానికి దారితీశాయి. నేడు వ్యావసాయికంగా పంజాబు రైతులు ముందడుగు వేశారన్నా పంజాబు సౌభాగ్యంతో కళకళలాడుతున్న దన్నా-బోర్లాగ్ సృష్టించిన గోధుమ వంగడాలు అందుకు మొదటి కారణం. 1963లో బోర్లాగ్ మొదటి సారిగా మన దేశం వచ్చారు. ఆ తర్వాత ప్రతిసంవత్సరమూ ఇక్కడికి వస్తూ ఇక్కడి కృషి శాస్త్రజ్ఞులకు ఆయన ఎన్నోవిధాల ప్రోత్సాహాన్నిస్తున్నారు. గత సంవత్సరం ఆయన వచ్చినపుడు పంజాబుకృషి విశ్వవిద్యాలయం వారాయనకు గౌరవ డాక్టరేటు పట్టానిచ్చారు.

డాక్టర్ బోర్లాగ్‌కు ప్రపంచంలో ఎన్నోదేశాలనుండి బహుమతులు, బిరుదులు పట్టాలు లభించాయి. మెక్సికోలోని రైతులు ఆయనకు "బంగారు గోధుమకంకి"ని బహూకరించారు. 68లో మెక్సికోలోని సియుడాడ్ నగరంలో ఒక వీధికి ఆయన పేరు పెట్టారు.

కాని తనపనే తనకు ఆనందం అయిన బోర్లాగ్‌కు ఇవన్నీకూడా అంత ముఖ్యం కాదు. అయినా సరే ఈ కర్మయోగికి నోబెల్ శాంతి బహుమతినివ్వడం ద్వారా ప్రపంచం తన కృతజ్ఞతను తెలియజేసింది.

# సాహిత్యం

నోబెల్ సాహిత్య బహుమతి అన్నది ప్రపంచమంతటా సంచలనం కల్గిస్తుంది. ఆ బహుమతి రష్యన్ రచయితకు ఇస్తామన్న ప్రకటన మరింత సంచలనాన్ని కల్గిసుంది.

సుమారుపదేళ్ల క్రిందబోరిస్ పాస్టర్నాక్‌కు నోబెల్ సాహిత్య బహుమతిని ప్రకటించినపుడు సోవియట్ ప్రభుత్వం ఆయనను ఆ బహుమతిని అందుకునే నిమిత్తం దేశం విడిచి వెళ్లనివ్వలేదు. బ్రతికినన్నాళ్లూ పాస్టర్నాక్‌కు స్వేచ్ఛలేదు. ఆయన ప్రియురాల్ని చెరసాలలో వుంచారు.

కనుక ఈసారి రష్యన్ రచయిత అలెగ్జాండర్ సోల్జెనిత్సిన్‌ను నోబెల్ సాహిత్య బహుమతికి అర్హుడిగా ఎన్నుకున్నారన్న వార్త తెలియగానే, సోవియట్ ప్రభుత్వం ఏమంటుంది. సోల్జెనిత్సిన్‌ను స్వీడెన్‌కు వెళ్ళనిస్తుందా– వంటి ప్రశ్నలు ప్రపంచమంతటా ఉత్పన్నమయ్యాయి సోల్జెనిత్సిన్ మాత్రం తాను ఈ బహుమతిని స్వీకరిస్తున్నానని, అనుమతి లభిస్తే డిసెంబర్‌లో స్టాక్‌హోమ్ నగరానికి వెళ్ళి దానిని అందుకుంటానని ప్రకటించారు. అంతేకాదు. తన ఆరోగ్యం బాగున్నది అనికూడా ఆయన ప్రత్యేకంగా చెప్పారు! మరి మాస్కో దేవుళ్ళచిత్తం ఎటు మళ్ళుతుందో ఎవరు చెప్పగలరు?

సోల్జెనిత్సిన్ 1918లో పుట్టాడు. అతడు పుట్టటానికి ఆరునెలల ముందు అతడి తండ్రి చనిపోయాడు. తల్లి పెంపకంలో పెరిగిన సోల్జెనిత్సిన్ రాస్టావ్ విశ్వవిద్యాలయంనుండి పట్టభద్రుడై, రెండవ ప్రపంచయుద్ధంలో ఆర్టిల్లరీ ఆఫీసరుగా పనిచేశారు.

ఆసందర్భంలో ఆయన ఒక మిత్రుడికి ఉత్తరం రాస్తూ అందులో అప్పటి రష్యన్ నియంత స్టాలిన్‌ను "ముసలిమీసాలు (ఓల్డ్‌విస్కర్స్)

---

*సొల్జెనిత్సిన్ రష్యా విడిచి వెళ్ళి నోబెల్ బహుమతి నందుకుని అమెరికాలో స్థిరపడ్డాడు.

అని అన్నారు. అది కారణంగా సోల్జెనిత్సిన్‌కు ఎనిమిదేళ్ళపాటు బలవంతపు కూలి శిబిరంలో గడపాలనే శిక్ష విధించారు. ఆయన సుమారు 11 సంవత్సరాలపాటు, ఖైదు, బహిష్కరణ. శిబిర వాసాలలో గడిపారు.

అందుకనే అయన రచనలన్నిటా ఈజీవితపు ఛాయలు కానవస్తాయి. "వన్‌డే ఇన్ ది లైఫ్‌ఆఫ్ ఇరాన్ డెనిసోవిచ్" అన్న నవలలో సోల్జెనిత్సిన్ కజకస్తాన్‌లో బలవంతపుకూలి శిబిరంలో ఒక రోజు (17 గంటలకాలపు) జీవితాన్ని వర్ణిస్తారు. అదిచదువుతుంటే ఈ ఇరవయ్యవ శతాబ్దంలో మానవ జీవితం. ఇంత నికృష్టంగా వుండగలదా అన్పిస్తుంది. మనుష్యులను మర యంత్రాలవలె జంతువులవలె చూపించే ఆ నవలలో అతిశయోక్తులు లేవు హాహాకారాలులేవు. కేవలం యదార్థమే చూపబడింది. అయినప్పటికీ ఎంతశక్తి వంతమయిన చిత్రణ—అది!

స్టాలిన్ మరణంతో రష్యన్ ఇనుపతెర కొద్దిగా సడలసాగింది. కృశ్చేవ్ నాయకత్వంలో చాల కొద్దిగా స్వేచ్ఛావాయువులు వీచసాగాయి. కృశ్చేవ్ నాయకత్వంక్రింద పైనచెప్పిన, నవల అతిత్వరగా 1962. నవంబరునెల "నోవిమిర్" అన్న పత్రికలో ప్రకటించబడింది. ఆ నవలను మెచ్చుకుంటూ కృశ్చేవ్- "అధికార దుర్వినియోగానికి సంబంధించిన ఈ నిజాలను గురించి మనం ఆలోచించాలి. ఈ నిజాలను పార్టీకి, ప్రజలకు చెప్పాలి. ఇటువంటివి మళ్ళీ జరగకుండా చూడాలి అన్నారు. (ఈ ప్రకటనలోకూడా "ప్రజల" ముందు "పార్టీ" వుండడం గమనించండి.)

స్టాలిన్ కాలపు సోవియట్ సమాజానికి అద్దంపట్టిన సోల్జెనిత్సిన్ నవల "ది ఫస్ట్ సర్కిల్" 1968లో ప్రచురించబడి ప్రపంచమంతటా సాహిత్యాభిమానుల మన్ననలనందుకుంది. బహిష్కరణలో వుండగా సోల్జెనిత్సిన్ కేన్సర్‌వ్యాధికి గురి అయ్యాడు. అపుడాయన తాష్కెంట్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆ అనుభవాన్ని పురస్కరించుకుని ఆయన- "కేన్సర్ వార్డ్" అన్న నవల రచించారు. నిజానికి అది కేన్సర్

వార్డ్‌ను గురించిన నవలమాత్రమేకాదు రోగభూయిష్ఠమైన సమాజానికి ప్రతీకగా ఆ వార్డు చిత్రించబడింది. అందులో సోల్జెనిత్సిన్ ఒకచోట అంటారు-''ఒకమనిషికి కేన్సర్ వ్రణం వస్తుంది. అతడు చస్తాడు. శిబిరాలు, మరి బహిష్కరణలు వంటివిగల దేశం మాత్రం ఎట్లా బ్రతకగలదు?"

'యాన్ ఇన్సిడెంట్ ఎట్ క్రెచెటోవ్కా నేషన్" - "మెట్రోనాస్ హవుస్, ఫార్ ది గుడ్ ఆఫ్ ది కాస్" వంటి నవలల్లోను "కేండిల్ ఇన్ ది విండ్'' వంటి నాటకాలలోను, ''ప్రష్యన్ నైట్స్" వంటి కవితలలోను సోల్జెనిత్సిన్ ప్రతీకవాదం, సమకాలీన సమాజంలోని లోటుపాట్లను, చావుకు సిద్ధపడి అయినా ఎత్తిచూపగల ధైర్యం కానవస్తాయి (ఈ రచలన్నీకూడా దొంగతనంగా బయటికి తీసుకురాబడి ఇతర దేశాలలో ప్రచురింపబడినాయి.)

1967లో సోవియట్ రచయితల సంఘపు సమావేశానికి రాసిన వుత్తరంలో- "సాహిత్యపు గంధం తెలియనివారికి సాహిత్యకారుల నెత్తిమీద నర్తించే అవకాశం ఇచ్చిన ఈ దుర్భర పరిస్థితి కొన్ని దశాబ్దాలుగా వుంది. దీనిని అంతంచేయండి. నా రచనలనోళ్ళు కట్టివేశారు. దాచారు. దూషించారు. మరి మీరు నా పక్షాన నిలబడి నిర్భయంగా నిజం పలకగలరా, లేదా సత్యం గమ్యంగాగల దారిపై నడవదలచిన నన్ను ఎవ్వరూ ఆపలేరు. చావనయినా చస్తానుగాని నేను సత్యాన్వేషణ మానను" అన్నారు సోల్జెనిత్సిన్.

కాని కృశ్చెవ్ తర్వాత మళ్ళీ ఆకొద్దిపాటి స్వేచ్ఛకూడా మృగ్యమయింది. పైవుత్తరంవంటి వాటి కారణంగా సోల్జెనిత్సిన్‌ను సోవియట్ రచయితల సంఘంనుండి బహిష్కరించారు. "కేన్సర్‌వార్డ్'' నవలను ''నోవిమిర్" పత్రికలో ప్రచురిస్తామని వాగ్దానం చేసికూడా ప్రచురించలేదు. రహస్య పోలీసువారాయనమీద ఏదోకేసు బనాయించారు, కాని, ఇపుడు నోబెల్ బహుమతితో సోల్జెనిత్సిన్ ప్రతిష్ఠ పెరిగింది. ఆయన సోవియట్ ప్రభుత్వపుగొంతులో పచ్చివెలక్కాయ అయి కూచున్నాడు.

"అన్నిరకాల పరిస్థితులలోనూ రచయితగా నా ధర్మాన్ని నిర్వహిస్తాను. బ్రతికివున్నప్పటికన్న మరణించాక నా ధర్మాన్ని నేను మరింత బాగా నిర్వహించగలనని నా అచంచల విశ్వాసం అయినప్పటికీ— ఒక రచయిత జీవించివుండగా అతని కలాన్ని నిరోధించరాదు అన్న పాఠం ఎన్నిసార్లు వల్లించినా నేర్చుకోలేక పోతున్నాము మనము...." అని ప్రకటించిన సోల్జెనిత్సిన్ స్వేచ్ఛావాయువులు పీల్చి బ్రతికే పరిపూర్ణ మానవుడి వంటివాడు. సోల్జెనిత్సిన్ వంటి రచయితలు సోవియెట్ ప్రభుత్వాల కన్న, నోబెల్ బహుమతుల కన్న గొప్పవారు.

వారు మానవజాతి ప్రగతి పథాన నిరంతరం వెలిగే దీపాలు.

[4 డిసెం. 70)